# అధికారుల మధ్య సమన్వయ లోపం..
# ప్రజలకు ప్రాణ సంకటం..!





**జలమండలి, బల్దియా అధికారుల నిర్లక్ష్యం**
**బస్తీవాసుల పాలిట శాపం**

**మన తొలివెలుగు, చాంద్రాయణగుట్ట ప్రతినిధి నార్కెట్‌పల్లి శైలేష్ కుమార్** అధికారుల మధ్య సమన్వయ లోపం పాతబస్తీ ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. బల్దియా, జలమండలి అధికారుల నిర్లక్ష్యంతో పాతబస్తీ లాల్ దర్వాజా, మొరంబావి, శివాజీ నగర్ ప్రధాన రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వర్షాకాలానికి ముందే చేపట్టాల్సిన పూడికతీత పనులు చేపట్టకపోవడంతో చిన్నపాటి వర్షానికే డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. అయితే ఇటీవల శివాజీ నగర్, మొరంబావి బస్తీలలో జలమండలి అధికారులు పూడికతీత పనులు చేపట్టారు. డ్రైనేజీలు, కాలువలలో పూడిక తీసిన మట్టిని, చెత్తాచెదారాన్ని తీసి రోడ్లపైనే వదిలేశారు. పూడిక తీయడమే తమ వంతని, పూడిక తీసిన మట్టిని, చెత్తాచెదారాన్ని బల్దియా అధికారులు తొలగించాలని జలమండలి అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతుండగా, పూడిక తీసిన మట్టిని, చెత్తాచెదారాన్ని జలమండలి అధికారులే తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. దీంతో రెండు శాఖల మధ్య సమన్వయ లోపం ప్రజల పాలిట శాపంగా మారింది. పూడిక తీసిన మట్టి, చెత్తాచెదారం వీధుల వెంట నిల్వచేరి చిన్నపాటి వర్షానికి తిరిగి డ్రైనేజీల లోకి వెళ్లి అవి పొంగిపొర్లడమే కాకుండా మట్టి రోడ్లపై చేరి బురదమయంగా మారుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు డ్రైనేజీ మురుగునీరు బస్తీలలో నిల్వ చేరి ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమలు వ్యాపించి సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే అధికారులు డ్రైనేజీల్లో, కాలువలలో పూడిక తీసి రోడ్లపై వేసిన మట్టిని, చెత్తాచెదారాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

**సమస్యను వెంటనే పరిష్కరించాలి**



అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాకపోకలు ఇబ్బందిగా మారాయి. డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ తెరిచి ఉండడంతో ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక డ్రైనేజీల నుండి తీసిన చెత్తాచెదారం రోడ్డుపైనే కుప్పలుగా పేరుకుపోవడంతో బస్తీ వాసులం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దుర్వాసన, దోమల బెడదతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతుంది. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. స్థానిక ప్రజలు అంటు రోగాల బారినపడే ప్రమాదం ఉంది. కావున ఇరు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసే సమస్యను వెంటనే పరిష్కరించాలి. లేని పక్షంలో స్థానిక బస్తీ ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు.

**వడ్డేపల్లి రాజు, స్థానిక బస్తీవాసుడు**

**అధికారుల సమన్వయ లోపం**

జలమండలి, జీహెచ్ఎంసీ అధికారుల మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారింది. ఇరు శాఖల అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది శాఖల అధికారులు సమన్వయంతో సమస్య జఠిలం కాకముందే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో స్థానిక బస్తీ వాసులంతా కలిసి జలమండలి, జీహెచ్ఎంసీ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.

## అన్ని హంగులతో నిర్మించిన సుమంగళ కన్వెన్షన్ హాల్ ని ప్రారంభించిన ఎమ్మెల్యే





**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** మహేశ్వరం మండల కేంద్రంలో పెట్రోల్ పంప్ సమీపంలో అన్ని హంగులతో నిర్మించిన సుమంగళ కన్వెన్షన్ హాల్ ని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కన్వెన్షన్ హాల్ యజమానులు ప్రొద్దటూరి చంద్రయ్య, ప్రొద్దటూరి శ్రీమాన్ వారి కుటుంబ సభ్యులతో, మహేశ్వరం మండల బీఆర్ఎస్ నాయకుల, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివాహాది శుభకార్యాలు, పుట్టిన రోజు వేడుకలు, మెమోరియల్ ఈవెంట్స్, తదితర అన్ని రకాల శుభకార్యాలకు అనుకూలంగా విశాలమైన ప్రత్యేక గదులతో నిర్మించారని, సెంట్రల్? ఏసీ కూడా ఏర్పాటు చేశామని కన్వెన్షన్ యజమానులు తెలిపారన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు శాలువాలు కప్పి మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు కుటుంబ సభ్యులతో కలిసి వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## బంగ్లాదేశ్ జాతీయుల అరెస్ట్ జోగిపేట డిపోర్టేషన్ సెంటర్ కు తరలింపు




**మన తొలివెలుగు, కుత్బుల్లాపూర్ ప్రతినిధి టీ. రమేష్ :** గాజులరామారం–జీడిమెట్ల ప్రాంతంలోని హెచ్ఏఎల్ ఏరియాలో ఉన్న ఒక అద్దె ఇంట్లో కొంత మంది బంగ్లాదేశ్ జాతీయులు అక్రమంగా నివసిస్తున్నట్లు జీడిమెట్ల పోలీస్ స్టేషన్ సిబ్బంది గుర్తించారు. ఈ సమాచారం అందడంతో జీడిమెట్ల పీఎస్ ఎస్‌హెచ్ఓ తన బృందంతో కలిసి ఆ ప్రదేశంలో సోదాలు నిర్వహించి ఏడుగురు (07) బంగ్లాదేశ్ జాతీయులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అదుపులోకి తీసుకున్న వ్యక్తులలో ఎవరి వద్దా భారతదేశంలో ఉండేందుకు అనుమతించే చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు లేదా ఇతర ప్రయాణ పత్రాలు లేవని తేలింది. ప్రాథమిక దర్యాప్తులో వారు భారతదేశంలోకి అక్రమంగా ప్రవేశించి దేశంలోని వివిధ ప్రాంతాల్లో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. కుత్బుల్లాపూర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) ఎన్. కోటి రెడ్డి ఆదేశాల మేరకు, వారిని నిర్బంధ, కదలికల నియంత్రణ చట్టం అదుపులోకి తీసుకుని మెదక్ జిల్లా జోగిపేటలోని డిపోర్టేషన్ సెంటర్‌కు తరలించారు. విచారణ పూర్తి అయిన తర్వాత బంగ్లాదేశ్ లోని వారి స్వస్థలాలకు తిరిగి పంపిస్తారు. ఈ ఆపరేషన్ లో ఎస్ఓటి కూకట్ పల్లి జోన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈదురు గాలులకు కింద పడిపోయిన మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి విగ్రహం

**అభిమానం చాటుకున్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**





**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** మహేశ్వరం మండల కేంద్రం చౌరస్తాలో ఉన్న మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి విగ్రహం గత మూడు రోజుల క్రితం ఈదురు గాలులకు కింద పడిపోవడం జరిగింది. శనివారం సబితా ఇంద్రారెడ్డి మహేశ్వరంలో సుమంగళ కన్వెన్షనల్ ఓపెనింగ్ కు వస్తుండగా మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి విగ్రహం కనిపించకపోవడంతో విషయం తెలుసుకొని కింద పడిపోయి ఉన్న స్వర్గీయ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని సర్పంచ్ మునగపాటీ నవీన్ తో మాట్లాడి గ్రామపంచాయతీకి అప్పగించారు. మహానేతనే పట్టించుకోని మహేశ్వర మండల తహసిల్దార్, ఎంపీడీవో, పోలీస్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మహేశ్వరం అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాన రహదారిపై ఉన్న మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం పడిపోయి మూడు రోజులు అవుతుంది. ఆ చౌరస్తా నుంచి మండల తహసిల్దార్, ఎంపీడీవో, అధికారులు కార్యాలయాలకు వెళుతుంటారు. సమీపంలోనే పోలీస్ స్టేషన్ కూడా ఉంది. అయితే వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం పడిపోవడం అధికారులకు ఎవరికి కనిపించలేదా..? స్థానిక సర్పంచ్ కు సమాచారం అందలేదా..? ఇక ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డికి కనిపించకపోతే వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం అలానే ఉండిపోవాల్సిందేనా..? మహా నేత విగ్రహం పడిపోతే చూస్తూ ఉండిపోతారా..? కాంగ్రెస్ నాయకులు ఉన్నట్టా.. లేనట్టా..? సమాజం ఎటువైపు వెళ్తుందని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

## డబల్ బెడ్ రూమ్ పెండింగ్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**మన తొలి వెలుగు, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో ప్రతినిధి జంగిటి రవీందర్ :** భువనగిరిలోని సింగన్నగూడెం డబుల్ బెడ్ రూమ్ పెండింగ్ పనులను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో చేపట్టాల్సిన మౌలిక వసతుల పనులు, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాలు, అంతర్గత రహదారులు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చేలా సంబంధిత అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీవాణి రవికుమార్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## జిల్లెలగూడలో తార్ కారు బీభత్సం

**పాలు పంపిణీ చేస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరి అన్నదమ్ములకు తీవ్ర గాయాలు**








**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** మద్యం మత్తులో తార్ కారును అతి వేగంగా నడపడంతో బీభత్సం సృష్టించింది. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లెలగూడ దాసరి నారాయణ కాలనీలో ఉదయం చోటు చేసుకుంది. మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లెలగూడా స్వాగత్ గ్రాండ్ హోటల్ ఎదురుగా, శ్రీ మణికంఠ జనరల్ స్టోర్ సమీపం (గల్లీ)లో గల శ్రీహర్ష సారీ సెంటర్ వద్ద శనివారం ఉదయం 6 గంటలకు మద్యం మత్తులో తార్ మహీంద్రా కారు స్కూటీపై ఇంటింటికి పాల ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఇద్దరు అన్నదమ్ములు అఖిలేశ్వర్ (22), విగ్నేశ్వర్ (16) లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. టీజీ 08 ఎ 7887 నంబర్ గల మహేంద్ర తార్ వాహనంలో డ్రైవర్ మిథిలా నగర్ నుంచి స్వాగత్ గ్రాండ్ వైపు వస్తున్నాడు. స్వాగత్ గ్రాండ్ నుంచి ఇంటింటికి పాల ప్యాకెట్లు పంపిణీ చేయడానికి టీఎస్ 08 ఈఎస్ 4771 స్కూటీపై మిథిలా నగర్ వైపు ఇద్దరు అన్నదమ్ములు వెళ్తున్నారు. మహీంద్రా తార్ కారు డ్రైవర్ మద్యం మత్తులో స్కూటీని ఢీకొట్టడంతో స్కూటీపై ఉన్న ఇద్దరు యువకులు ఎగిరి అవతల పడ్డారు. మహీంద్రా కారు అదే స్పీడ్ లో వెళ్లి శ్రీహర్ష సారీ సెంటర్ మొదటి మెట్టు పైకి ఎక్కింది. దీంతో అక్కడే ఆగిపోయింది. స్కూటీ కారు కిందికి మధ్యలోకి వెళ్ళి ఇరుక్కుపోయింది. షాపు లేకపోతే ఇద్దరి అన్నదమ్ముల మీద నుంచి వెళ్లిపోయేదని స్థానికులు తెలిపారు. కారులో రెండు బీరు బాటిల్లు ఉన్నాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఎల్బీనగర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ బర్త్ డే పార్టీకి వెళ్లి వస్తూ మద్యం సేవించి వాహనం నడిపినట్లు సమాచారం. కారులో 2 బీర్ బాటిళ్ళు ఉన్నాయి. ఘటనాస్థలికి చేరుకున్న మీర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తాటి చెట్టు కూలి మహిళ మృతి

**ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తాటి చెట్టు కూలడంతో ఘటన**





**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** బలమైన ఈదురుగాళ్లకు తాటి చెట్టు కూలి ఓ ఇంటిపై పడడంతో ఆ ఇంటిలో నిద్రిస్తున్న ఓ మహిళ తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో భారీ ఈదురుగాలులకు తాటి చెట్టు కూలిపడి ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. సభావత్ లక్ష్మి తన కుమారుడు వెంకట్ రామ్, కోడలు లలితతో కలిసి లలితా నగర్ లోని రాఘవేంద్ర నగర్ కాలనీలోని ఓ రేకుల ఇంట్లో అద్దెకు నివాసం ఉంటున్నారు. వీరంతా వికలాంగులేనని స్థానికులు తెలిపారు. శుక్రవారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో బలమైన ఈదురుగాలులు వీచడంతో ఇంటి పక్కనే ఉన్న తాటి చెట్టు ఒక్కసారిగా కూలి, ఇంట్లో నిద్రిస్తున్న సబావత్ లక్ష్మి (75) కుటుంబ సభ్యులపై పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలపాలైన సభావత్ లక్ష్మిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కుమారుడు వెంకట్ రామ్, కోడలు లలిత స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చెట్టు కూలి గోడపై పడి మధ్యలో విరిగింది. మధ్యలో ఇరగకపోతే మహిళ మృతి చెందేది కాదని, ఆమె కుటుంబ సభ్యులకు ఎటువంటి గాయాలు కాకపోయేవని, సురక్షితంగా బయటపడేవారని స్థానికులు తెలిపారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గుంతల రోడ్లలో ప్రయాణం నరకం

**గుంతలమయంగా మారిన బొయిగూడ, కందికల్ గేట్ ప్రధాన రహదారి**
**వాహనదారులు, స్థానికులకు తీవ్ర ఇబ్బందులు**





**మన తొలివెలుగు, చాంద్రాయణగుట్ట, ప్రతినిధి నార్కెట్‌పల్లి శైలేష్ కుమార్** పాతబస్తీలో రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ముఖ్యంగా కందికల్ గేట్, బొయిగూడ ప్రధాన రహదారి గుంతల్లో వర్షపు నీరు నిలిచి వాహనదారులకు, స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. వర్షాల పడ్డ తర్వాత రోడ్డుపై ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలు బురదమయంగా మారాయి. ద్విచక్ర వాహనదారులు గుంతల్లో అదుపుతప్పి కింద పడుతున్న ఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి. బురదలో నుంచే తెగించి ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆటోలు, కార్లు, లారీలు నెమ్మదిగా కదలడంతో ట్రాఫిక్ జామ్ నిత్యకృత్యమైంది. గుంతల కారణంగా ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే పెద్ద ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉంది అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే శాశ్వత మరమ్మత్తులు చేపట్టకపోతే జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని స్థానికులు హెచ్చరించారు.

